క్లుప్తంగా

చేనేత కార్మికుడికి సాయం అందజేత



బాధితుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఎంతో ఆనందం ఉందని వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు అన్నారు. బుధవారం దగ్గులూరు గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు సీహెచ్ శ్రీనివాస్‌కు రూ. 10,500 ఆర్థిక సహాయం అందజేశారు. సుధాకరరావు మాట్లాడుతూ శ్రీనివాస్ గత కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. ఇటీవల కాలు తొలగించడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి రావడంతో ఆర్థిక సహాయం అందించామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పీర్ సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకరరావు, జవ్వాజి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సీఐ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీవేద

నరసాపురం: వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం నరసాపురం రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలోని పోలీసు స్టేషన్ల నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు నిర్వహణ, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కొత్త చట్టాలను ప్రతి పోలీస్ స్టేషన్‌లో అమలు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సర్కిల్ పరిధిలో తీసుకున్న చర్యలు, బ్లాక్‌స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. సమన్లు, నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్ కేసులను సమీక్షించారు. నరసాపురం రూరల్ సీఐ జి.దుర్గా ప్రసాద్, నరసాపురం రూరల్, మొగల్తూరు ఎస్సైలు టి.వెంకటసురేష్, జి.వాసు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవానికి సిద్ధం కావాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆగస్టు 15న నిర్వహించబోయే జిల్లా స్థాయి స్వాతంత్య్ర దినోత్సవాలకు సన్నద్ధం కావాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. 'హర్ ఘర్ తిరంగా' ప్రచారంలో భాగంగా జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన సెల్ఫీ పాయింట్ వద్ద బుధవారం కలెక్టర్ సెల్ఫీ దిగారు. కలెక్టర్ మాట్లాడుతూ త్రివర్ణ పతాకంతో దిగిన సెల్ఫీలు 'హర్ ఘర్ తిరంగా' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ నెల 15 తేదీ వరకు ప్రతీ ఒక్కరూ తమ ఇళ్ల వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని విజ్ఞప్తి చేశారు. స్వాతంత్య్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు వీలుగా పోలీసు కవాతు మైదానంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రముఖులు, ప్రజా ప్రతినిధులకు సీటింగ్ ఏర్పాట్లు, ఆహ్వానం, స్వాతంత్య్ర సమరయోధులను గుర్తించి వివరాలను సిద్ధం చేయాలన్నారు. వివిధ పథకాలతో శకటాలు, స్టాళ్ల ప్రదర్శన ఉండాలన్నారు.

వేధింపులపై మున్సిపల్ కార్మికుల ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

భీమవరం: భీమవరం మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్ వేధింపుల నుంచి పారిశుద్ధ్య కార్మికులకు విముక్తి కల్పించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, సీఐటీయు జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు, ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి కొల్లాబత్తుల మహంకాళి కలెక్టర్ చదలవాడ నాగరాణికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భీమవరం పురపాలక సంఘం ప్రజారోగ్య విభాగంలో పని చేస్తున్న పర్మినెంటు, ఆప్కాస్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నిత్యం అధికారులు వేధిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉదయం 4 గంటలకు ముందే మస్తరుకు రావాలని, ఆదివారం సెలవు రోజున పనులు చేయాలని లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు. సెలవు దినాల్లో పని చేసినందుకు అవుట్ సోర్సింగ్ వర్కర్లకు రాష్ట్రంలో అమలు అవుతున్న విధంగా జాతీయ, పండుగ దినాల్లో సెలవు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ కార్యాలయంలో వసతులు నిల్



నరసాపురం మున్సిపల్ కార్యాలయ భవనం



మున్సిపల్ కార్యాలయంలో పైఅంతస్తులో ఉన్న రెవెన్యూ సెక్షన్



షెడ్డు లేకపోవడంతో బయట పెట్టిన మోటార్‌సైకిళ్లు

- మెట్లెక్కలేక ప్రజల అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న పన్ను చెల్లింపుదారులు
- కనీసం కూర్చోవడానికి స్థలం లేని వైనం

నరసాపురం: కార్పొరేట్ తరహాలో పదేళ్లక్రితం నిర్మించిన నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో సరైన వసతులు లేక కార్యాలయానికి వచ్చే ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మున్సిపాల్టీకి సంబంధించిన రెవెన్యూ సెక్షన్ కార్యకలాపాలను భవనం మొదటి అంతస్తులో ఏర్పాటు చేశారు. దీంతో వృద్ధులు, అనారోగ్యంతో వున్న వారు మెట్లెక్కలేక పోతున్నారు. పాత భవనంలోనే పరిస్థితి బాగుండేదని వాపోతున్నారు. కార్యాలయ భవనంలో కమిషనర్ చాంబర్, చైర్మన్ చాంబర్, పరిపాలనా విభాగం, అకౌంట్స్ సెక్షన్లను గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేశారు. అయితే ప్రజలు ఎక్కువగా మున్సిపల్ కార్యాలయానికి రెవెన్యూ సెక్షన్ పనులపై వస్తుంటారు. కానీ రెవెన్యూ సెక్షన్ మాత్రం మొదటి అంతస్థులో ఏర్పాటు చేశారు. దీంతో పన్నులు, షాపుల అద్దెలు కట్టడం లాంటి కీలక వ్యవహారాల కార్యకలాపాలు మొదటి అంతస్తులో జరుగుతున్నాయి. మళ్లీ చలానాలు చెల్లించే విభాగాన్ని గ్రౌండ్‌డ ఫ్లోర్‌లో ఏర్పాటు చేశారు. దీంతో చలానాలు కట్టడం కోసం కిందకు రావడం, మళ్లీ రెవెన్యూ కార్యకలాపాల కోసం పైకి వెళ్లాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఈ అంశాన్ని పలువురు చాలా కాలంగా అధికారులు దృష్టికి తీసుకెళ్తూ వస్తున్నారు. రెవెన్యూ సెక్షన్ కార్యకలాపాలను కిందకు మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సైకిల్ స్టాండ్ లేకపోవడంతో ఎక్కడి పడితే అక్కడే పార్కింగ్ చేసుకోవాల్సి వస్తోంది.

అధికారులకే సౌకర్యాలు

మున్సిపల్ కార్యాలయ భవనంలో అధికారులు, ఉద్యోగులకు మాత్రం అన్ని సౌకర్యాలు ఉంటాయి. ప్రతి గదినీ అందంగా తీర్చిద్దారు. కమిషనర్, చైర్‌పర్సన్ చాంబర్లతో పాటుగా, కౌన్సిల్ హాల్లో కూడా ఏసీలు ఉంటాయి. అయితే వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు మాత్రం కనీసం కూర్చోవడానికి బయట బల్లలు కూడా సరిపడా లేని పరిస్థితి. వివిధ పనుల కోసం వచ్చిన వారు అక్కడే అరుగులపై కాలక్షేపం చేయాల్సి వస్తుంది. కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం సరిపడా ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

బార్ అసోసియేషన్ కార్యదర్శిగా విన్నా ప్రకాష్



విన్నా ప్రకాష్

నరసాపురం: నరసాపురం న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శిగా విన్నా సూర్య ప్రకాష్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది నల్లిమిల్లి జోసెఫ్ తెలిపారు. బుధవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 143 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసిన విన్నా ప్రకాష్‌కు 113 ఓట్లు లభించగా ఆయన పై పోటీ చేసిన రొక్కాల గ్లాడ్‌స్టన్ కుమార్‌కు 29 ఓట్లు వచ్చాయి. అలాగే జూనియర్ కార్యవర్గ సభ్యులుగా పులపర్తి హర్షవర్ధన్, గోరింకల వినోద్ కుమార్, కొల్లాటి ఆదినారాయణ, కంభాల స్వర్ణ ఎన్నికయ్యారని జోసఫ్ వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా బూసి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా వైదాని నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా నక్కా ఆనంద్ బాబు, లైబ్రరీ కార్యదర్శిగా నారిన శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శిగా రాయసం రాధారాణి, కోశాధికారిగా పూరిళ్ళ శ్రీనివాస్ తదితరులు గతంలోనే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన వివరించారు.

వడ్డీ రాయితీ పంపిణీ

పెనుగొండ: మండలంలోని ములపర్రులోని హిందూ ముస్లిం వ్యవసాయ సహకార పరపతి సంఘ సభ్యులకు మూడు శాతం వడ్డీ రాయితీని బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ చైర్మన్ గుత్తుల లోకేశ్వరరావు, నెక్కంటి భాస్కరరావు, ఊటాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత బస్సు ప్రయాణం

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని మహిళలకు శుక్రవారం నుంచి ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాదరావు తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు డిపోలకు సంబంధించి 298 బస్సులకు గానూ 223 బస్సులల్లో మహిళ ఉచిత ఉపయోగిస్తున్నట్లు ఆయన తెలిపారు. పల్లె వెలుగు, అల్ట్రా, సిటీ ఆర్డనరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని స్పష్టం చేశారు.

అప్రజాస్వామికంగా ఉప ఎన్నికలు



గౌరీ సుభాషిణి

పెనుమంట్ర: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలు అప్రజాస్వామికంగా సాగాయని పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి బుధవారం ఒక ప్రకటనలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎన్నికల నిర్వహించే అధికారులు అధికార టీడీపీకి తొత్తులుగా వ్యవహరిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడటం దురదృష్టకరమని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీ, స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్లను పోలింగ్ బూత్‌లకు వెళ్లకుండా అధికార కూటమి నేతల అడ్డుకోవడం వారికి పోలీసులు అండగా నిలవడం దుర్మార్గమని పేర్కొన్నారు. కొందరు అధికారులు టీడీపీ నేతలకు వత్తాసు పలకడం చూస్తుంటే రాష్ట్రఎన్నికల చరిత్రలోనే ఉపఎన్నికలు సంఘటన మాయని మచ్చగా నిలిచాయని విమర్శించారు.

పథకాల పేరుతో బాబు ప్రజలను మోసం చేస్తున్నారు



లక్ష్మణేశ్వరంలో నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

నరసాపురం రూరల్: ఎన్నికల ముందు అబద్ధపు హామీలు గుప్పించి అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటను అటకెక్కించి రాష్ట్ర ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేశారని వైఎస్సార్ సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పీడీ రాజు అన్నారు. మండలంలోని లక్ష్మణేశ్వరం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఎన్నిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర బీసీసెల్ జనరల్ సెక్రటరీ దొంగ మురళీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ చాగంటి సత్యనారాయణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పని చేసే వారికి పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణేశ్వరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లక్ష్మణేశ్వరం గ్రామశాఖ అధ్యక్షుడిగా మత్తే సువర్ణరాజు, ప్రధాన కార్యదర్శులుగా బాలం మల్లేశ్వరరావు, పెచ్చెట్టి మంగేశ్వరరావు, దొంగ నర్సింహారావు, గుండుబోయిన వెంకటేశ్వరరావు, దిద్దే మోహన్, కార్యదర్శులుగా మైల రామకృష్ణ, అందే సత్తిబాబు, కవురు నాగరాజు కార్యవర్గ సభ్యులుగా కొపనాతి వెంకట సుబ్బారావు, సనమండ్ర రాజేంద్ర కుమార్, పాకా శ్రీను, బారి శివ. తోట నాని, గంటా వెంకటేశ్వరరావు, కె.భాస్కర్, నక్కా ఏడుకొండలు, తిరుమాని శ్రీను, కె.చిన్నా, బి.అర్జున్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు యూత్ గ్రామ అధ్యక్షులు వీరవల్లి బాలకృష్ణ, రైతు విభాగం అధ్యక్షులు వేంద్ర బాబూరావు, ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షులు కాటం ఫణివర్ధన్, బీసీ సెల్ గ్రామ అధ్యక్షులు తిరుమాని మాధవ్, మహిళా గ్రామ అధ్యక్షురాలు మొల్లేటి నాగదేవి, మేధావుల ఫోరం అధ్యక్షులు పరసా శ్రీను తదితరులు ఎన్నికయ్యారు. నూతన సభ్యులను పార్టీ నాయకులు అభినందించారు.

ఉత్సాహంగా హర్‌ఘర్ తిరంగా యాత్ర



పాలకొల్లు సెంట్రల్: హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



నరసాపురం రూరల్: కొప్పర్రు ప్రాథమిక పాఠశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా యాత్ర ఉత్సాహంగా నిర్వహించారు. బుధవారం కళాశాలలో విద్యార్థులు 100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ మాట్లాడుతూ విద్యాశాఖ కమిషనరేట్ ఆదేశాల ప్రకారం హర్ ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమం మూడు రోజులు చేయనున్నట్లు తెలిపారు. అధ్యాపకులు యామిని, భద్రాచలం, రామకృష్ణ, వి.విజయలక్ష్మి, జి.మహేష్ పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: మండలంలని కొప్పర్రులో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం కొప్పర్రు ప్రాథమిక పాఠశాలో ఉపాధ్యాయిని ఉప్పుగంటి రాజశ్రీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్య్ర దినోత్సవ గొప్పతనాన్ని వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్న పలువురు సమరయోధుల గురించి వివరించారు.

దేశాభివృద్ధికి యువత తోడ్పాటు ముఖ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న సీఐలు రజనీకుమార్, శ్రీనివాస్

పాలకొల్లు సెంట్రల్: దేశాభివృద్ధికి యువత తోడ్పాటు ఎంతో ముఖ్యమని అలాంటి యువత మాదకద్రవ్య రహిత దేశం కొరకు పాటు పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణ సీఐ కోలా రజనీకుమార్ అన్నారు. బుధవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద నాషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణ సీఐ రజనీకుమార్, రూరల్ సీఐ గుత్తుల శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో మాదకద్రవ్యరహిత భారతదేశం కోసం అవగాహనా సదస్సు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ ఉన్నత విద్యతో పాటు దేశాభివృద్ధికి యువత ముందుకు రావాలన్నారు. యువత ఒక్కసారి వక్రమార్గంలోకి వెళితే తన జీవితం సర్వం కోల్పోయినట్లేనన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు పృథ్వీ, రూరల్ ఎస్సై బి.సురేంద్ర, ఏఎస్సైలు మార్‌లింగం, కోదండ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో.....

నాషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని శివదేవునిచిక్కాల జెడ్పీ హైస్కూల్‌లో ప్రతిజ్ఞ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ ఐక్యమై సమాజం అభివృద్ధికి మాదకద్రవ్య రహిత దేశం కోసం పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.రాము, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.మంగ, ఎస్ఎన్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గౌతమి కళాశాలలో

పాలకొల్లు సెంట్రల్: ప్రజలు గంజాయి, మాదకద్రవ్యాల్లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఎక్సైజ్ ఎస్సై మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వాన తెచ్చిన తంటా



పెనుగొండ: సిద్ధాంతం పంచాయతీ కార్యాలయంలోకి చేరిన వర్షపు నీరు



పెనుగొండ: రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



పెనుగొండ: సిద్ధాంతం అరుంధతీ పేటలో వర్షపు నీరు

పెనుగొండ: ఆచంట నియోజక వర్గంలో ఎడతెరపి లేకుండా భారీ వర్షం దంచి కొట్టింది. బుధవారం నాలుగు గంటలకు ప్రారంభమైన భారీ వర్షం రాత్రి 8 గంటల వరకూ కురుస్తూనే ఉంది. కుంభవృష్టి ని తలపించే విధంగా కురిసిన భారీ వర్షం కొన్ని గ్రామాల్లో ఉపశమనం, కొన్ని ప్రాంతాల్లో ముంపునకు గురి చేసింది. ప్రజలైతే నాలుగు గంటల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా కురిసింది. వర్షపు నీటితో డ్రెయిన్లు ఉప్పొంగి ప్రవహించాయి. కొతాలపర్రు, తామరాడ, చినమల్లం, నడిపూడి, కొడమంచిలి, ఆచంట వేమవరం ప్రాంతాల్లో వరి చేలకు ఉపశమనం కలిగించాయి. ఇటీవల ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో నీరందకు నాట్లు ఎండుతున్నాయి. ఈ తరుణంలో కురిసిన వర్షం ఉపశమనం కలిగింది. అయితే పల్లపు ప్రాంతాల్లో మాత్రం ఇబ్బందికరంగా మారింది. గ్రామాల్లో రహదారులపై మురుగు డ్రెయిన్‌లలోని మురుగునీటితో కలసి రోడ్లుపై ప్రవహించింది. దీంతో దుర్వాసన వెదజల్లాయి.

సిద్ధాంతం పంచాయతీలోకి వర్షపు నీరు

ఎడతెరపి లేకుండా కుంభవృష్టి కురవడంతో సిద్ధాంతం పంచాయతీ కార్యాలయంలో వర్షం నీరు ప్రవహించింది. అరుందతీ పేట, చినపేట, చెరువుపేట ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. దీంతో వాహనదారులు నానావస్థలకు గురయ్యారు. ముఖ్యంగా మోటారు సైకిళ్ల సగభాగం వరకూ నీరు నిలిచిపోవడంతో వాహనాలు ముందుకు సాగే పరిస్థితి లేకుండా పోయింది. పెనుగొండలో గోంగూరు తూము సెంటర్, చెరుకువాడ, వంతెన వీధి, శివాలయం వీధుల్లో రోడ్లుపై నీరు ప్రవహించింది.

కాలనీల్లో నానావస్థలు

ఏకదాటిగా కురిసిన వర్షంతో నియోజకవర్గంలోని కాలనీల్లో నివాసం ఉంటున్న కాలనీ వాసులు నానావస్థలకు గురయ్యారు. మౌలిక సదుపాయాల లేమితో ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులకు వారి నివాసాలకు వెళ్లే మార్గం కానరాక గోతులు పడుతూ లేస్తూ వెళ్లారు. కాలనీల్లో గుబురుగా పెరిగిన పొదలతో వాటిలో పెరిగిన పాములు వర్షంతో బయటకు నీటి ప్రవాహంతో పాటు కొట్టుకు వస్తుండడంతో హడలిపోయారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన ఎడతెరిపిలేని భారీ వర్షం కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడి మండలంలోని అన్ని గ్రామాలు అంధకారంలో కురుకుపోయాయి. పెనుమంట్ర మండలంలో ప్రతి శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు మెయింటనెన్స్ పనులు పేరుతో పగలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఐదారు గంటల పాటు అధికార కోతలు విధిస్తుండగా మిగిలిన రోజుల్లో స్థానిక అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతిరోజు గంటా రెండు గంటలు విద్యుత్ అంతరాయం పేరుతో అనధికార కోతలు విధిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

చాంబర్స్ కళాశాలలో విగ్రహ ఏర్పాటుపై రగడ

- కొత్త వివాదం సృష్టించిన మంత్రి నిమ్మల
- కళాశాల యాజమాన్యం గుండెల్లో గుబులు



చాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ప్రముఖ కళాశాల అయిన చాంబర్స్ కళాశాలలో మంత్రి నిమ్మల రామానాయుడు కొత్త వివాదం సృష్టించారు. చాంబర్స్ కళాశాలలో ఇటీవల మరణించిన కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కలిదిండి రామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించడం వివాదాస్పదమవుతుంది. రామరాజు ఆడిటర్‌గా పట్టణంలో కొందరికి సుపరిచితులు. రామరాజు తనకు రాజకీయంగా, ఆర్థికంగా ఎంతో వెన్నుదన్నుగా ఉండేవారని ఆయన మరణించిన అనంతరం కొన్ని సమావేశాల్లో మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పుకుంటూ వస్తున్నారు. రామరాజు మరణాంతరం ఆయన సంస్మరణ సభలో చాంబర్స్ కళాశాలలో ఆయన విగ్రహం ఏర్పాటుచేస్తానని మంత్రి నిమ్మల ప్రకటించారు. అనంతరం ఇటీవల అల్లూరి సీతారామరాజు జయంతి పురస్కరించుకుని పట్టణ కాస్మో కల్చరల్ కాంప్లెక్స్‌లో జరిగిన సమావేశంలో బహిరంగంగానే రామరాజు విగ్రహం చాంబర్స్ కళాశాలలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దానితో చాంబర్స్ కళాశాల యాజమాన్యం గుండెల్లో గుబులు పట్టుకుంది.

సామాజికవర్గ సమస్యగా మారుతున్న వైనం

పట్టణంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో గత 50 సంవత్సరాలుగా చాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ నడుస్తుంది. కళాశాల నిబంధనల ప్రకారం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీకి ఎవరైతే చైర్మన్‌గా ఉంటారో వారే కళాశాలకు చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఈ 50 ఏళ్లలో 98 శాతం ఆర్యవైశ్యులే ఇక్కడ పాలకమండలి చైర్మన్‌లుగా కొనసాగుతూ వచ్చారు. అయితే సుమారు మూడేళ్ల క్రితం యాజమాన్యం, అధ్యాపక బృందంతో ఏర్పడిన కొన్ని సమస్యల కారణంగా చైర్మన్‌గా ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన కారుమూరి నరసింహారావు ఉండడడంతో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా క్షత్రియ సామాజికవర్గానికి చెందిన కలిదిండి రామరాజును నియమించారు.

సమస్య ఎక్కడంటే?

కళాశాలలో ఈ యాభై ఏళ్లలో చైర్మన్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా పనిచేసిన సభ్యుల్లో మరణించిన వారి విగ్రహాలు ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం మంత్రి రామానాయుడు కొన్ని సమావేశాల్లో రామరాజు విగ్రహం ఏర్పాటుచేస్తానని ప్రకటిస్తున్నారు. ఇది ఎలా కుదురుతుందంటూ కళాశాల యాజమాన్య సభ్యులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. మంత్రి రామానాయుడు చెప్పినట్లు రామరాజు విగ్రహం కళాశాలలో ఏర్పాటు చేస్తే కళాశాల అభివృద్ధికి పని చేసి కీర్తిశేషులైన ఆర్యవైశ్య చైర్మన్లు, స్థల దాతలు విగ్రహాలు ఎందుకు పెట్టరని కళాశాల కమిటీ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ రామరాజు విగ్రహం పెట్టకపోతే మంత్రి చెప్పినా ఏర్పాటు చేయలేదని క్షత్రియుల నుంచి విభేదాలు వచ్చే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా మంత్రి రామానాయుడు మాటను ధిక్కరించామనే అపవాదుతో పాటు ముందుముందు ఇబ్బందుల్లో పడతామేమోనని ఇటు చెప్పలేక అటు చేయలేక కళాశాల యాజమాన్యం సందిగ్ధంలో పడినట్లు సమాచారం. ఇప్పటివరకూ లేని కొత్త సంస్కృతిని తీసుకురావడం ఎందుకంటూ సభ్యులు ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.